# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం 14 అక్టోబర్ 2025


# జలదిగ్బంధంలో మణుగూరు పట్టణం

### సింగరేణి కాలరీస్‌లో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

### పొంగి పొర్లుతున్న వాగులు వంకలు జనజీవనం అస్తవ్యస్తం

**మణుగూరు అక్టోబర్ 13 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గడిచిన 24 గంటల్లో కుండపోతు వర్షం కురవడంతో, మణుగూరు పట్టణం మొత్తం జలదిరిగ్బంధంలో మునిగిపోయింది. సింగరేణి కాలరీస్ లో ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీగా వర్ధనీరు వచ్చి చేరడంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. మణుగూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న వాగులు వంకలు పొర్లి వరద నీరు మొత్తం మణుగూరు పట్టణాన్ని అనుసంధానం చేసి ప్రవహించే కోడిపుంజులు వాగు, కట్టు వాగు, మట్టి వాగు పొంగిపొర్లుతున్నాయి. మణుగూరు మండలంలో కూనవరం ప్రాంతంలో ఉన్న రైల్వే ట్రాక్ పై వరద నీరు పొంగి ప్రవహిస్తుంది. మణుగూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై వరదనీరు పొంగి ప్రవహిస్తుంది. అలాగే మణుగూరు నుండి భద్రాద్రి పవర్ ప్లాంట్ కు నిర్మించే రైల్వే బ్రిడ్జి కింద పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో మణుగూరు నుంచి ఎటునాగారం ఏడూల బయ్యారం వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మండలంలో మారుమూల ప్రాంతమైన పగిడేరు రామంజరం గ్రామాలను అనుసంధానం చేసే పేరంటాలు చెరువు పొంగి పొర్లడంతో అలుగు నుంచి భారీగా వరద నీరు ప్రవహించటం తో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో సుందరయ్య నగర్ శేషగిరి నగరు ఆదర్శనగర్ శివలింగాపురం తదితర గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి వచ్చి చేరింది. ఇటీవల నిర్మించిన కాలనీలలో వర్షపు నీరు రావడంతో కాలనీ చుట్టూ పెద్ద ఎత్తులో వరద నీరు వచ్చి చేరింది. దీంతో కాలనీలో నివసించే ప్రజలు పిల్లాపాపలతో బిక్కుబిక్కుమంటూ కాలయాపన చేస్తున్నారు. పరిస్థితిని అంచనా వేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు మణుగూరు ఎమ్మార్వో అద్దంకి నరేష్ ఎంపీడీవో శ్రీనివాసరావు మున్సిపల్ కమిషనర్ యుద్ధ ప్రాతిపదికపై సహాయం అయ్యారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టడంతో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. అనేక కాలనీలలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో అనేక ఇల్లు నీటి ప్రభావం లో మునిగి ఉండటం ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తుంది.



సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో వరదనీరు చేరిన దృశ్యం



మణుగూరు పగిడేరుమధ్య చెరువు పొంగి వరదనీరు రోడ్డుపై ప్రవహిస్తున్న దృశ్యం



పొంగి పొరలిస్తున్న వాగులు వంకలు దృశ్యం





## ఏఈ నిర్లక్ష్యంతో ఎండుతున్న పంటలు

### విద్యుతు శాఖ ఏఈ నరేష్ నిర్లక్ష్య వైఖరిపై పిర్యాదు

### జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో పిర్యాదు ఇచ్చిన బిజెపి నాయకులు బండి మల్లయ్య యాదవ్

**కరీంనగర్, అక్టోబర్ 13(నినాదం):** పంట పొలాలు ఎండి పోవడానికి అలాగే విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎఇ. లైన్మెన్స్ పై చర్యలు తీసుకొవాలని సోమవారం రోజున ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కు బిజెపి నాయకులు బండి మల్లయ్య యాదవ్ పిర్యాదు చేశారు. పిర్యాదు లో పేర్కొన్న విధంగా వివరాల లోకి వెళితే మొగ్దుంపూర్, రూరల్ మండలం, శివారులోని పురేణిగుట్ట వ్యవసాయ భూములలో 4 కరెంటు స్థంబాలు మాకు తెలియకుండా అక్రమంగా ఎఇ. వేయించినారు. అవి తీయమని ఎన్నిసార్లు ఎఇ.ని విన్నవించుకున్నాగాని తీయడం లేదు. పైగా అందులో ఒక స్థంభం విరిగిపోయి ఉన్నది దాని వలన కరెంటు అంతరాయంతో పాటు ఆ పొలంలోకి ట్రాక్టర్, హార్వెస్టర్స్ రావడంలేదు. అలాగే కరెంట్ ట్రాన్స్ఫుర్మర్ గత కొద్దిరోజుల క్రితం కాలిపోయింది. ఇట్టి విషయం గురించి ఏఇ. ని అడగా విరిగిన స్థంభం తీయకుండా, మరొక స్థంభాన్ని వేసే, లేబర్ అందుబాటులో లేరని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చి తప్పించుకు వెళ్ళిపోయాడు. దీనివలన బావులలో నీరు ఉన్నా, కరెంట్ లేక పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయి. దానితో అప్పులు చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నా మాకు పంట నష్టము జరిగి మా కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలు న్నాయి. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొని కరెంటు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు, చేయించి, అలాగే మా పంట పొలాల్లో వేసిన కరెంట్ స్థంభాలను తొలగించి, పంట పొలాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి లో పిర్యాదు ఇచ్చిన బండి మల్లయ్య యాదవ్.



## కరాటేతో పిల్లల్లో మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

### ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి

**కరీంనగర్, అక్టోబర్ 13(నినాదం):** ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెన్నై తమిళనాడులో జరిగిన బోధి వరల్డ్ రికార్డ్ అధికారిక ప్రయత్నంలో పాల్గొని అప్రిసియేషన్ సర్టిఫికేట్ అందుకున్న అన్వర్ ఖాన్, ఆయన కుమారులు ఫర్హాన్ ఖాన్, అర్మాన్ ఖాన్‌లను టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. అన్వర్ ఖాన్ తన కుటుంబ సభ్యులను కరాటేలో ప్రావీణ్యం సాధించేలా తీర్చిదిద్దడమే కాకుండా, పేద విద్యార్థులకు స్వీయ రక్షణతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించే శిక్షణ అందిస్తూ కరీంనగర్‌కు గౌరవం తెచ్చారని ఆయన పేర్కొన్నారు.కరాటే క్రీడలు పిల్లల్లో మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిస్తాయని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఓటమి వచ్చినప్పుడు ఎలా గెలవాలో, పడిపోయి నప్పుడు ఎలా లేవాలో నేర్పే క్రీడ కరాటే అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సర్దార్ హరేమేందర్ సింగ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ రాజు, కోటేష్, మల్లేశం తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.



## భీమన్న కాదు.. రాజన్నే...

### ఎల్ఈడి స్క్రీన్ ద్వారా రాజన్న దర్శనం

**వేములవాడ, అక్టోబర్ 13(నినాదం):** దక్షిణ కాశిగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా భక్తులకు ప్రత్యామ్నాయంగా ఎల్ఈడి స్క్రీన్ ల ద్వారా రాజన్న దర్శనం కల్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ నుండి ఒక ప్రకటన వెలువడింది. ప్రస్తుతం జరుగుతున్న వేములవాడ ఆలయ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా, అర్చకులు వేద పండితుల నుండి వచ్చిన విలువైన సూచనలతో, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు ఎల్ఈడి స్క్రీన్ మరియు తాత్కాలిక ఏర్పాట్లు ద్వారా ఆలయంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనం కల్పించాలని నిర్ణయించారు. దేవాదాయ శాఖ భక్తుల కోసం ఇక్కడే అర్జిత సేవలను సైతం అందిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరలో పాల్గొనే భక్తులు తొలుత రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం ఆలయ నిర్మాణం పూర్తయ్యే వరకు భక్తులకు రాజన్న దర్శనాన్ని కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా కేంద్ర మంత్రి బండి సంజయ్ అధికారులతో చర్చించడం వలన రాజన్న ఆలయంలో ఎల్ఈడి స్క్రీన్ ల ద్వారా దర్శన సౌలభ్యం కల్పిస్తున్నట్లు బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి



**జమ్మికుంట, అక్టోబర్ 13 (నినాదం):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన జువ్వాజి సుమన్(39) అనే యువకుడు గత కొద్ది రోజుల క్రితం కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం కు తరలించగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య కళా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

### ఐఎంఏ అధ్యక్షుడిగా

## కన్నవేన డాక్టర్ తిరుపతి





**జమ్మికుంట, అక్టోబర్ 13 (నినాదం):** హుజురాబాద్ జమ్మికుంట ఐఎంఏ బ్రాంచ్ అధ్యక్షుడిగా జమ్మికుంట పట్టణానికి చెందిన సురక్ష ఆసుపత్రి డాక్టర్ కే తిరుపతి ఎన్నికయ్యారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ప్రముఖ వైద్యులు డాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. హుజురాబాద్ ఐఎంఏ అధ్యక్షులుగా డాక్టర్ కనవేన తిరుపతి తోపాటు డాక్టర్ ఉడుగుల సురేష్ పోటీ పడగా కనవేన తిరుపతి 19 ఓట్ల మెజారిటీతో అధ్యక్షుడిగా గెలుపొందారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా హుజురాబాద్ పట్టణానికి చెందిన దుర్గ ఆసుపత్రి వైద్యులు శ్రీనివాస్ , కోశాధికారిగా హుజురాబాద్ పట్టణానికి చెందిన తోగురు విద్యాసాగర్ ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ హుజురాబాద్ , జమ్మికుంట ప్రాంత వైద్యులకు ఐఎంఏ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ల సంక్షేమమే లక్ష్యంగా ఐఎంఏ తన బాధ్యతలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. డాక్టర్లందరూ సంఘటితంగా ఉండి సమస్యలపై సానుకూలంగా స్పందించి తనకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. తన విజయానికి కారణమైన హుజురాబాద్ జమ్మికుంట వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా రాబోయే రోజులలో ఐఎంఏ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు నిరుపేదలకు వైద్యం అందించడంలో తాము అందరము కూడా ముందు ఉంటామని వెల్లడించారు. అనంతరం హుజరాబాద్ జమ్మికుంట వైద్యులు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను ఘనంగా సన్మానించారు.

## అభివృద్ధి పేరుతో రాజన్నను దూరం చేస్తారా

### కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తారా?

### బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్





**వేములవాడ, అక్టోబర్ 13(నినాదం):** అభివృద్ధి పేరుతో రాజన్నను భక్తులకు దూరం చేస్తారా అని బిజెపి పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి కొనసాగిస్తూ భక్తులకు దర్శన సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆలయ ఈవో రమాదేవికి సోమవారం బిజెపి నేతలతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ నిత్యం 50 వేల మంది భక్తులు దర్శించుకునే పుణ్యధామం ఎములాడ క్షేత్రమని, కేంద్ర ప్రభుత్వం గుర్తించిన పర్యాటక ప్రదేశాల్లో ఎక్కువ మంది భక్తులు సందర్శించే దివ్యధామం మన వేములవాడ అన్నారు. అలాంటి మహిమాన్విత క్షేత్రాన్ని అభివృద్ధి పనుల పేరుతో భక్తులకు దూరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమంటే తమ బాధలను దేవదేవుడికి చెప్పుకునే అవకాశాన్ని దూరం చేయడం కాదా అని ప్రశ్నించారు. రాజన్నను దర్శించుకుందామని వస్తే భీమన్న వద్దకు వెళ్లాలని చెప్పడం కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. దర్శన భాగ్యం లేకుండే చేస్తే ఆలయ శక్తి తగ్గుతుందనే ఆందోళనతో భక్తులు తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ రాజన్న ఆలయ అభివృద్ధికి వ్యతిరేకం కానేకాదని, భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకుని రాజన్న దర్శన భాగ్యం కల్పిస్తూనే అభివృద్ధి పనులు చేపట్టాలన్నదే బీజేపీ డిమాండ్ అని స్పష్టం చేశారు. అవసరమైతే రాజన్న క్షేత్రంలోనే ఆగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా బాలాలయాన్ని ప్రాణప్రతిష్ట చేసి భక్తులకు దర్శనం కల్పించాలని కోరారు. దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ఆలయాన్ని కూడా అభివృద్ధి పేరుతో భక్తులకు దూరం చేసిన దాఖలాల్లేవని తెలిపారు. వారణాసిలోని అత్యంత పురాతన కాశీ విశ్వనాథ్ ఆలయం, ఉత్తరాఖండ్ లోని ప్రసిద్ధమైన కేదార్‌నాథ్ ఆలయాన్ని, అయోధ్య రామ మందిర నిర్మాణం, శబరిమలలో 2019లో పునర్నిర్మాణ పనులు, మధురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయంతోపాటు కాణీపాకం ఆలయ పునర్నిర్మాణ పనుల సమయంలోనూ భక్తులకు దర్శనం కల్పించకుండా నిషేధించలేదని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమయంలో అనేకసార్లు ధ్వంసమైన సోమనాథ్ ఆలయాన్ని సైతం అనేకసార్లు అభివృద్ధి చేసినా ఎన్నడూ మూసివేయలేదని తెలిపారు. 2016 నుండి 2022 వరకు దాదాపు 6 ఏళ్లకుపైగా యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టినా ఎన్నడూ యాదగిరి శ్రీ లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోకుండా భక్తులకు దూరం చేయలేదన్నారు. గర్భాలయ అభివృద్ధి పనులు జరిగేటప్పుడు కూడా యాదాద్రి కొండపైనే బాలాలయాన్ని శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్ట చేసి భక్తుల దర్శనానికి ఇబ్బందుల్లేకుండా చేశారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క వేములవాడ లోనే ఇలా ఎందుకు చేస్తున్నారని, భక్తులకు ఎములాడ రాజన్న ఆలయ దర్శన భాగ్యం లేకుండా ఎందుకు నిషేధం విధిస్తున్నారని ప్రశ్నించారు. దీపావళి పండుగ తరువాత సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లాలనుకునే ప్రతి ఒక్కరూ తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల నుండి సైతం ఎములాడ రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని అమ్మవార్ల బాట పడుతారు. ఇలాంటి సంప్రదాయం, సంస్కృతి, ఆనవాయితీలకు తిలోదకాలిచ్చే దుశ్చర్య కాదా అన్నారు. అన్ని ఆలయాల అభివృద్ధి సమయంలో ఏ విధానాలను, సాంప్రదాయాలను అనుసరించారో వాటినే ఇక్కడ కూడా అమలు చేయాలన్నదే భారతీయ జనతా పార్టీ అభిమతమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేణికింది అశోక్, బిల్లా కృష్ణ, రేగుల శ్రీకాంత్, నామాల శేఖర్, మామిండ్ల లక్ష్మీరాజ్యం, అన్నం నరసయ్య, గుడిసె మనోజ్, తడక రాజు, కోలా ధను తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### పలు ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమిపూజలో పాల్గొన్న సుడా చైర్మన్

### అర్హత కలిగి మిగిలిపోయిన లబ్ధి దారులకు కూడా ఇళ్లు మంజూరు చేస్తాం

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, అక్టోబర్ 13(నినాదం):** కరీంనగర్ నగర శివారు ప్రాంతాలు బొమ్మకల్,ముగ్దుంపూర్, కరీంనగర్ రూరల్ మండలం లోని చర్లభుత్కూర్,చామన్ పల్లి గ్రామాల్లో పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాలలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. నరేందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు ఉండా లన్నదే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆనాడైన ఈనాడైన ఇందిరమ్మ రాజ్యంలోనే ఇళ్లు కట్టించడం జరుగుతుందని మిగితా ప్రభుత్వాలు మాటల వరకే పరిమితం అయ్యాయని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.అర్హులై ఉండి ఇళ్లు మంజూరు కాక మిగిలిపోయిన ప్రతి ఒక్కరికి రాబోయే రోజుల్లో తప్పకుండా మంజూరు చేస్తామని నరేం దర్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు సాయిని తిరుపతి, మండల్ అధ్యక్షులు కామరెడ్డి రాంరెడ్డి, వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, మీసాల సాయిలు, గంగయ్య, నరసయ్య, కూర నరేష్ రెడ్డి,బుర్ర నారాయణ, రంగయ్య,జగ్గాని కనకయ్య, శంకరయ్య, బుర్ర గంగయ్య,రామస్వామి, దామోదర్ రెడ్డి, దిలీప్ రెడ్డి, బుసా సాయి,రాము, సుదర్శన్,బుర్ర హరీష్, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## 18న బీసీ బంద్‌కు సహకరించాలి

**నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 13 (నినాదం):** ఈనెల 18 తలపెట్టిన బీసీ బంద్ కు సహకరించాలని నిజామాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మాస్టర్ శ్రీనివాస్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇవ్వదలచిన 42 శాతం రిజర్వేషన్లను కొందరు అగ్రవర్ణాల వారు కోర్టులో కేసు వేసి నిలిపివేశారని తెలిపారు. ఈనెల 18న రాష్ట్ర బంద్ కు సహకరించాలని నిజామాబాద్ లో పలు సంస్థలను కలిసి వారి సహకారం కోరారు. నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మాస్టర్ శ్రీనివాస్ ని కలిసి వారి సహకారం కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, పోల్కం గంగ కిషన్, కరిపె రవీందర్, దర్శనం దేవేందర్, కొయ్యడ శంకర్, బాలన్న, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం 14 అక్టోబర్ 2025

# భయపెడుతున్న ఏడాకుల చెట్టు

## ఘాటైన వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

## శ్వాస కోశ వ్యాధులు వచ్చే అవకాశం



**వెల్గటూర్, అక్టోబర్ 13 (నినాదం న్యూస్):** ప్రకృతిలో మానవ ఉనికికి మొక్కలే ప్రాణాధారం. మధుర ఫలాలు, చక్కని పువ్వులు, చల్లని నీడ, ప్రాణ వాయువు, వర్షాలు.. ఇలాంటి ఎన్నో ప్రయోజనాలు మొక్కలతో మనకి సమకూరుతాయి. సాధారణంగా రోడ్డు పక్కన కనిపించే పచ్చని చెట్లు, సువాసనలు వెదజల్లే పూలు ఎవరికైనా ఆహ్లాదాన్నిస్తాయి. మనసును తేలిక పరుస్తాయి. కానీ వెల్గటూర్ మండల కేంద్రంలోని కోటిలింగాల కమాన్ రోడ్డు వెంబడి నాటిన చెట్ల వలన ప్రజలు వాటి పూలను చూడడానికి గాని, వాసన పీల్చడానికాని అస్సలు ఇష్టపడటం లేదు. ఏడాకుల పాల చెట్లు, డెవిల్ ట్రీ, సప్తపర్ని, దెయ్యం చెట్టు వంటి పేర్లతో వీటిని పిలుస్తారు. కమాన్ రోడ్డు గుండా వెళ్ళే ప్రజలకు కొత్త భయం పట్టుకుంది. ఈ చెట్ల నుండి వచ్చే గాలి స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. పచ్చదనం కోసం ప్రభుత్వం నాటిన చెట్లే ఇప్పుడు వారిని భయపెడుతోంది. గాలి పీల్చాలంటేనే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. నీళ్ళు లేకపోయినా ఏపుగా, అత్యంత వేగంగా పెరిగే ఏడాకుల పాల చెట్లను గతంలో హరితాహారంలో భాగంగా కోటిలింగాల రోడ్డు, మండలంలో భారీ ఎత్తున నాటారు. ఏడాది పొడవునా కొమ్మలు, రెమ్మలతో ఈ చెట్లు కళకళలాడుతాయి. ఇప్పుడా మొక్కలు పెరిగి పెద్దవయ్యాయి. వీటి ఆకులను గిల్లితే పాలు కారుతాయి. అందుకే వీటిని ఏడాకుల పాల చెట్టు అంటారు. ఒక్కో గుచ్ఛానికి ఏడు ఆకులు ఉ ంటాయి. ఇప్పుడా మొక్కలు ఏపుగా పెరిగి పుష్పిస్తున్నాయి. అక్టోబర్ డిసెంబర్ మధ్య కాలంలో ఈ చెట్టు కొమ్మలకు ఉన్న పుష్పాలన్నీ ఒకేసారి పుష్పిస్తాయి. వీటి నుండి వెదజల్లే పుప్పొడి రేణువుల వల్ల ఒక రకమైన భరించలేని వాసన వస్తుంది. వీటి వల్ల మనుషుల్లో తీవ్రమైన వికారం, తలనొప్పి, ఊపిరితిత్తుల సమస్య, శ్వాస కోశ వ్యాధులు వచ్చే ప్రమాదముందని వృక్ష శాస్త్ర నిపుణులు అంటున్నారు. చలికాలంలో ఈ చెట్ల పరిసరాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. తర్వాత ప్రభుత్వం వీటిని నాటకూడదని నిషేధం విధించినప్పటికీ అంతకుముందు నాటిన చెట్లే ఏపుగా పెరిగి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని ఈ చెట్ల కొమ్మలు తొలగించడంతో ఉపశమనం పొందారు. తిరిగి ఏడాది గడిచే సరికి చెట్ల కొమ్మలు మళ్ళీ పుష్పించడంతో మళ్ళీ యథాస్థితికి వచ్చింది. తాత్కాలిక నివారణ చర్యలు చేపట్టకుండా శాశ్వతంగా వీటిని తొలగించి తమ సమస్యను పరిష్కరించాలని సమీప ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఢిల్లీ, నోయిడాలో ప్రభుత్వం వీటిని పూర్తిగా కొట్టి వేయించారు. అత్యంత ప్రమాదకరమైన ఏడాకుల పాల చెట్లను ప్రూనింగ్ చేయడమో లేక కొట్టి వేయించడమో చేయాలనీ ప్రజలు కోరుతున్నారు. ఈ చెట్ల కలపను ఉపయోగించి బ్లాక్ బోర్డులు, స్కూల్ పిల్లలు వాడే పలకలు, అగ్గి పుల్లల తయారీకి ఉపయోగిస్తారు. అయితే వీటిని జనావాసాల మధ్య కాకుండా అటవీ ప్రాంతంలో నాటి ఉండాల్సిందని పలువురు సూచించారు.

**'తెల్లవారు జామున వాసన భరించలేక పోతున్నాం': బోడకుంటి రమేష్, రాజక్కపల్లి**



మేము రోజు తెల్లవారు జామున కోటిలింగాల రోడ్డులో మార్నింగ్ వాకింగ్ చేస్తుంటాం. కమాన్ రోడ్డు వెంబడి మొత్తం ఏడాకుల చెట్లే పెరిగి పూలు పూస్తున్నాయి. ఉదయం, సాయంత్రం అయిందంటే చాలు అదో రకమైన ఘాటైన వాసన వస్తుంది. తీవ్రమైన తలనొప్పి వస్తుంది. ముక్కుకు రుమాలు కట్టుకుని ఉదయం సాయంత్రం నడక కొనసాగించాల్సి వస్తుంది. రాత్రి సమయంలో మా రాజక్కపల్లి స్టేజి వరకు కూడా వీటి ఘాటైన వాసన తో మేము తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ప్రభుత్వం వీటిని శాశ్వతంగా తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



# అల్ఫోర్స్‌కు అత్యుత్తమ సీబీఎస్ఈ పాఠశాల అవార్డ్

**కరీంనగర్, అక్టోబర్ 13(నినాదం):** తెలంగాణ రాష్ట్ర విద్యా రంగంలో అల్ఫోర్స్ విద్యాసంస్థలు చేస్తున్న కృషి చాలా విశిష్టమైనదని స్ఫూర్తిదాయకమైనదని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హైదరాబాద్ లోని ఒక ప్రైవేట్ వేడుక మందిరంలో నిర్వహించి నటువంటి ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాలకు అత్యుత్తమ సీబీఎస్ఈ పాఠశాల అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యాసంస్థల ఆరంభం నాటి నుండే విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ, భారతదేశంలోని అగ్రశ్రేణి అధ్యాపకులచే నాణ్యతమైన విద్యను అందిస్తూ, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా భారతదేశం లోని ప్రఖ్యాతిగాంచిన విద్యా సంస్థలైన ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు, ఎయిమ్స్, మెడికల్ కళాశాలలో, సీఏ పరీక్షల ఫలితాలలో సీట్లు సాధించే విధంగా విజయం సాధింప చేస్తున్నామని, పటిష్టంగా స్థిరపడేటట్టు చేస్తున్నామని గర్వంగా తెలిపారు. విద్యాసంస్థల్లో అవలంబిస్తున్నటువంటి విద్యా విధానాలను అంతర్జాతీయ జాతీయస్థాయిలో ప్రశంసింపబడి విద్యారంగానికి తలమానికంగా నిలుస్తున్నదని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు. విద్యాసంస్థల్లో విద్యా, క్రీడల పట్ల అవలంబిస్తున్నటువంటి విధివిధానాలకు ఆకర్షితులై జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఆల్ఫోర్స్ కు పురస్కారాలు వస్తున్నాయని అందులో భాగంగానే హైదరాబాద్లో గ్లోబల్ ట్రైంఫ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి ఇండియా కంక్లేవ్ సమావేశంలో రాజకీయ ప్రముఖులు సముద్రాల వేణుగోపాల చారి, సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా బెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల అవార్డును స్వీకరించడం జరిగింది. ఈ అవార్డు రావడానికి అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందికి, చేయూత నందిస్తున్నటువంటి తల్లిదండ్రులకు అంకిత మిస్తున్నట్లు చెప్పారు. అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ బాధ్యతను పెంపొందించి నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వివిధ విద్యా సంస్థల యజమాన్యాలు, యువజన, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఐఎంఏ అధ్యక్షుడికి ఘన సన్మానం

**జమ్మికుంట, అక్టోబర్ 13 (నినాదం):** హుజురాబాద్ జమ్మికుంట ఐఎంఏ అధ్యక్షుడిగా ఎన్నికైన జమ్మికుంట సురక్ష ఆసుపత్రి డాక్టర్ కనవేన తిరుపతిని స్థానిక కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. సోమవారం జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఎన్నికల్లో ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ కే తిరుపతి ఎన్నిక కావడంతో స్థానిక కాంగ్రెస్ నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ, సమాజ సేవలో ఎప్పుడు ముందు వరుసలో ఉ ండే డాక్టర్ తిరుపతి భవిష్యత్తులో కూడా మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని నిరుపేదలకు ఐ ఎం ఏ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వారికి ఉచిత వైద్యం అందించాలని కోరారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పాతకాల ప్రవీణ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మానుపాటి సూర్య ఆయుబ్ సంతోష్ ప్రకాష్ రాజ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు దరఖాస్తులు సమర్పించిన నేతలు

**కరీంనగర్, అక్టోబర్ 13(నినాదం):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తున్న ఆశవహుల నుండి సోమవారం రోజున కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయ కార్యదర్శులు నాత శ్రీనివాస్, దొంతి గోపి లకు ఆశావహులు దరఖాస్తులను నేరుగా అందజేయడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తూ 32 మంది దరఖాస్తు చేసుకోగా, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోరుతూ 22 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు సమర్పించిన వారిలో వెలిచాల రాజేందర్ రావు, వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆరేపల్లి మోహన్, పత్తి కృష్ణారెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, శ్రీమతి కర్ర సత్య ప్రసన్నా రెడ్డి, కాశి పాక రాజేష్, సత్తు మల్లేశం, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆకారపు భాస్కర్ రెడ్డి, ఉట్కూరి నరేందర్ రెడ్డి, జిల్లా మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, నెల్లి నరేష్ , మాచర్ల ప్రసాద్, దాసరి భూమయ్య, తిప్పారపు సంపత్, మహమ్మద్ ఖాలీముద్దీన్, మ్యాకల రవీందర్, సయ్యద్ జమాలుద్దీన్, మూల జైపాల్ మహమ్మద్ అబ్దుల్ సలాం, ఎస్.కె సిరాజ్ హుస్సేన్, శ్రీపురం నాగప్రసాద్, పడాల రాహుల్, దీకొండ శేఖర్, రుద్ర సంతోష్, ప్యాట రమేష్, గూడెపు సారంగపాణి, చర్ల పద్మ ఉన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోరుతూ దరఖాస్తు చేసిన వారిలో బానోతు శ్రావణి నాయక్ ముల్కల ప్రవీణ్ షబానా మహమ్మద్, కొరివి అరుణ్ కుమార్, మహమ్మద్ తాజుద్దీన్, మాచర్ల ప్రసాద్ సయ్యద్ ముజీబ్ హుస్సేన్ కంకణాల అనిల్ కుమార్ సర్దార్ ధన సింగ్ మహమ్మద్ అబ్దుల్ సలాం అస్తపురం రమేష్ ఎస్.కె సిరాజ్ హుస్సేన్ మహమ్మద్ జమాలుద్దీన్ అబ్దుల్ రెహమాన్ బోనాల శ్రీనివాస్ కొట్టే ప్రభాకర్ దీకొండ శేఖర్ గడ్డం శ్రీనివాస్ వీర దేవేందర్ పటేల్ వైద్యులు అంజన్ కుమార్ మహమ్మద్ ఇంతియాజ్ అలీ ఉన్నారు. స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో ఏఐసిసి, టిపిసిసి పరిశీలకులకు అందజేయడం జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ కార్యాలయ కార్యదర్శులు తెలిపినారు.

# ఆలయాన్ని రాజకీయ వేదికగా మార్చవద్దు





## కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి పాలాభిషేకం

వేములవాడ, అక్టోబర్ 13(నినాదం) : రాజన్న ఆలయాన్ని రాజకీయ వేదికగా మార్చవద్దని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ కోరారు. సోమవారం వేములవాడ రాజన్న ఆలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అబివృద్ధి విషయంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను బీజేపీ దహనం చేయడం పట్ల మండిపడ్డారు. రాజన్న ఆలయ అభివృద్ధిని అడ్డుకోవద్దని, అడ్డుకుంటే చరిత్ర లో మిగిలిపోతారని హెచ్చరించారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తే బిజెపి నాయకులు ఎందుకు తట్టుకోవడం లేదని, అభివృద్ధి సమయంలో భక్తులకు దర్శనం ఎలా సాధ్యమన్నారు. ఎవరు అడ్డుపడినా ఆలయ అభివృద్ధి మాత్రం నిలిపే ప్రసక్తే లేదన్నారు. హిందూ ధర్మం అని గొప్పగా చెప్పుకునే వారు హిందూ దేవాలయం అభివృద్ధి చెందితే వారికి బాధ ఏమిటని ప్రశ్నించారు. ఒక బీసీ నాయకుడు రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తే మీకు నచ్చడం లేదా అన్నారు. పదేళ్లుగా బీజేపీ, బిఆర్ఎస్ రెండు ప్రభుత్వాలు రాజన్న గుడిని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయామని అన్నారు. మా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మీకు మింగుడు పడడం లేదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, నాయకులు సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు, చిలుక రమేష్, పాత సత్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన జిల్లా ఎస్పీ



**వేములవాడ, అక్టోబర్ 13 (నినాదం):** ప్రమాదం బారిన పడిన ఓ వ్యక్తిని తన పైలట్ వాహనంలో ఆసుపత్రికి తరలించి మానవ త్వం చాటారు జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే. వివరాల్లోకి వెళితే రాజన్న సిరిసిల్ల జిల్లా పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో ఓ వ్యక్తి ప్రమాదం బారినపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న జిల్లా ఎస్పీ గమనించి వెంటనే ప్రమాదం బారిన పడిన వ్యక్తిని తన పైలట్ వాహనంలో జిల్లా ఆసుపత్రికి సకాలంలో తరలించారు.



# మహాలక్ష్మి దేవాలయం ముందు హైమాస్ లైట్లు ఏర్పాటు చేయండి

## కోడూరి రవీందర్ గౌడ్
## మాజీ కార్పొరేటర్ కట్టరాంపూర్, కరీంనగర్

**కరీంనగర్, అక్టోబర్ 13(నినాదం):** కరీంనగర్ పట్టణంలోని 10వ డివిజన్ కట్టరాంపూర్ లో మహాలక్ష్మి దేవాలయం వద్ద ఉన్న హైమాస్ లైట్లు పాడైపోయినవి. అందువలన దేవాలయం వద్ద రాత్రి సమయంలో చీకటిగా ఉండటంతో భక్తులు, కాలనీ వాసులు అటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారని మాజీ కార్పొరేటర్ కోడూరి రవీందర్ గౌడ్ సోమవారం రోజున నగర పాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ కలసి కాలనిలో ఉన్నా సమస్య లపై ఇచ్చిన వినతి పత్రం లో కోరారు కాలనీలో పలు చోట్ల ఇప్పటికే ఏర్పాటు చేసిన లైట్లు పాడై పోయి చీకటిమయంగా ఉంటుంది. కట్టరాంపూర్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారిలో లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అని అన్నారు. గతంలో మున్సిపల్ అధికారులు ఇట్టి పాత లైట్లను తొలగించి తీసుకెళ్లి, తిరిగి మరలా ఏర్పాటు చేయలేదు. అలాగే ఉ న్న వీధి లైట్లను కూడా సమయపాలన పాటించకుండా ఇష్టం వచ్చిన సమయంలో ఆన్‌ఆఫ్ చేస్తున్నారు. కాలనీలో ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉ ంటుంది. మురికి కాలువల వద్ద ఉన్న గడ్డిని తొలగించడం లేదు. ఇట్టి విషయముపై సంబంధిత జవాన్కు విన్నవించినా పట్టించుకోవడం లేదని లైట్స్ పోయిన స్తంబాల నెంబర్లు ఇచ్చి వాటిని తిరిగి బిగించాలని, కమీషనర్ కు ఇచ్చిన వినతి పత్రం లో కోరారు. దీనిపై కమీషనర్ సానుకూలంగా స్పందించారని మాజీ కార్పొరేటర్ తెలిపారు.



# వికలాంగుల పాఠశాలలో బిఆర్ఎస్ నేత జన్మదిన వేడుకలు

## పిల్లలకు స్వీట్లు పండ్లు పంపిణీ చేసిన మంద రాజేష్

**జమ్మికుంట, అక్టోబర్ 13 (నినాదం):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద రాజేష్ జన్మదిన వేడుకలను శ్రీ సత్య సాయి వికలాంగుల పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఉన్న విద్యార్థులకు పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ, పిల్లలు భగవంతుడితో సమానమని అలాంటి పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. వేడుకల పేరుతో వృధా ఖర్చు చేయకుండా ఇలాంటి పిల్లల మధ్య జరుపుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని పసిపిల్లల ఆశీస్సులు దేవుడి ఆశీస్సులతో సమానమని ఆయన సందర్భంగా పేర్కొన్నారు. అన్ని సక్రమంగా ఉన్న పిల్లలను పెంచడం కష్టమవుతున్న ఈ రోజుల్లో అంగవైకల్యం ఉన్న పిల్లలను ఎంతో ప్రేమగా పెంచుతున్న ఆశ్రమ నిర్వాహకులు సూత్రం బుచ్చి రాములు దంపతులను ఈ సందర్భంగా రాజేష్ అభినందించారు. భవిష్యత్తులో సత్యసాయి వికలాంగుల పాఠశాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని దాతలు ఎవరైనా సరే ఇలాంటి కార్యక్రమాలు ఇక్కడ నిర్వహించుకోవడం వల్ల పిల్లలకు మన వంతు సహాయం చేసిన ఫలితం దక్కుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర సతీష్ అంబాల హరీష్ కనకం రత్నాకర్ ఎర్ర వంశీ తదితరులు పాల్గొన్నారు.



# పేద కుటుంబానికి ప్రణవ్ ఆర్థిక చేయూత

**జమ్మికుంట, అక్టోబర్ 13 (నినాదం):** హుజురాబాద్ పట్టణంలోని ఒక పేద ముస్లిం కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ సోమవారం ఆర్థిక సహాయం అందించారు. 19వ వార్డుకు చెందిన అమీరున్ మనవరాలు వివాహానికి కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మనవరాలు వివాహానికి సాయపడడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సొల్లు బాబు, 19 వార్డు అధ్యక్షురాలు సొల్లు సునీత, గోస్కుల రాజ్ కుమార్, గాలిబ్ నరేష్, ఎండి ఇమ్రాన్ లతో పాటు అమీరున్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్షులుగా దరఖాస్తు చేసుకొన్న మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్




**కరీంనగర్, అక్టోబర్ 13(నినాదం):** కరీంనగర్ జిల్లా, నగర అధ్యక్ష్య పదవుల కోసం అప్లికేషన్స్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు నాత శ్రీనివాస్, గోపి కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ బ్యాధులకు జిల్లా కాంగ్రెస్ మైనారిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ కలిమోద్దీన్, సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ చాంద్, మైనారిటీ చైర్మన్ తాజోద్దీన్ తరుపున ధరఖాస్తు ఇవ్వడం జరిగింది. తాజోద్దీన్ జూబ్లీహిల్స్ ఎలక్షన్స్ నిమిత్తం తెలంగాణా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ ఇంచార్జ్ హైదరాబాద్ గచ్చిబౌలిలో ఒక హొటల్ లో మీటింగ్ పెట్టినారు దాని కారణంగా వీరు ఇచ్చినారు గత 32 సంవత్సరాలనుండి, కాంగ్రెస్ పార్టీ కోసం ఫుల్ టైం వర్కర్ గా పార్టీ ని నమ్ముకొని పార్టీ లు మారకుండా తెలుగుదేశం, తెరాస ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతూ, దాదాపు 8 పోలీస్ కేసులు పెట్టి కోర్టు లో నడుస్తున్న 5 కేసులు కొట్టివేయగా 3 కేసులు పెండింగ్ లో ఉన్నాయి, అయినా భయపడకుండా కన్నా తల్లి అయినటువంటి పార్టీ కి ద్రోహం చేయకుండా నిరంతరం పార్టీ కోసం పని చేస్తున్న నాకు జిల్లా లేక నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవులు ఇవ్వాలని తొలిసారిగా కోరడం జరిగింది కరీంనగర్ జిల్లా చెరిత్ర లో ఒక ముస్లిం కు కూడ జిల్లా నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవులు ఇవ్వలేదు ఎందుకంటే 33 శాతం ఓట్లు ఉన్న నగరంలో, అసెంబ్లీలో కానీ మెజారిటీ ఉన్నాము అందులకే కాంగ్రెస్ పార్టీ కుటుంబ పెద్దల ఆశీర్వాదం తో నాకు అవకాశం కల్పిస్తారని నమ్మకం తో వున్నానని తాజోద్దీన్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

# రాజీవ్ రహదారిలో రోడ్డు విస్తరణ తగ్గించండి



**అల్వాల్, అక్టోబర్ 13 (నినాదం):** రాజీవ్ రహదారిపై నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ ను 200 అడుగుల నుండి 120 అడుగుల వరకు తగ్గించాలని రోడ్డుకి ఇరువైపులా ఆస్తులు కోల్పోతున్న బాధితులు శుభశ్రీ గార్డెన్ లోతుకుంట నుండి తెలంగాణ తల్లి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు .వారు మాట్లాడుతూ ప్రధానంగా రోడ్డు విస్తరణ నో తగ్గించినట్లయితే అనేక మందికి ఊరట లభిస్తుందని లేనిపక్షంలో చాలామంది సీనియర్ సిటిజెన్సులు పైసా పైసా కూడా కట్టుకొని నిర్మించుకున్న ఇండ్లు తమ ఆస్తులను కోల్పోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బజార్ దగ్గర గల బ్రిడ్జి రోడ్డు ను తెలంగాణ తల్లి నుండి నేరుగా నిర్మించాలని దాని వలన జీవీ రెడ్డి కాలనీ వారికి చాలా ఉపశమనం కలిగిస్తున్నాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ ప్రతినిధులు తేలు కుంట సతీష్ గుప్తా, డాక్టర్ సుధాకర్, రాఘవేంద్ర, సూర్య ప్రకాష్ రెడ్డి భాష ,కృష్ణారెడ్డి కమలయ్య ధనలక్ష్మి ,సచిన్, అనురాధ, విజయలక్ష్మి పెద్ద ఎత్తున బాధితులు పాల్గొన్నారు

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం 14 అక్టోబర్ 2025


## రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

### -కలెక్టర్‌తో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**వికారాబాద్, అక్టోబర్ 13(నినాదం ):**
వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో నాయకులతో సోమవారం కలిసి,తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నియోజకవర్గ పరిధిలో గల పలు సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా సకాలంలో వడ్ల, పత్తి కొనుగోలు కేంద్రలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక పర్మీషన్లు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తయ్యే విధంగా చూడాలని కోరారు. నియోజకవర్గనికి మంజూరైన సబ్ స్టేషన్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకొవాలని కోరారు. వీటితో పాటు ముఖ్యమైన పలు సమస్యలను కలెక్టర్ తో చర్చించారు.

## పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్యాయత్నం

**భీమదేవరపల్లి అక్టోబర్ 13 (నినాదం):**
మేనమామ తన కూతురుతో పెళ్లి చేస్తానని చెప్పి చేయడంలేదని ఓ యువకుడు సోమవారంఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం బొల్లోనిపల్లి గ్రామానికి చెందిన మహేందర్ సెల్ఫీ వీడియో తీసుకుని పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసాడు. యువకుడు తీసుకున్న సెల్ఫీ వీడియోలో తనపై మేనమామ కుమారస్వామి ఇంట్లో బంగారం దొంగతనం జరిగితే మేనమామ తనను అనుమానించాడని, తన కూతురూ విషయంలో తప్పు పట్టాడని ఆరోపించాడు. తనను మానసిక వేదనకు గురిచేసి ఈ పరిస్థితి రావడానికి తన మేనమామ, మరదలే కారణమని పురుగుల మందు తాగాడు. గ్రామస్తులకు సెల్ఫీ వీడియో పంపించగా అతన్ని అక్కడ నుండి ములుకనూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మహేందర్ చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

## ప్రజా సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బోయిని మహేష్ యాదవ్





**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :**
హఫీజ్ పేట్ డివిజన్ లోని పలు ప్రజా సమస్యలపై చందానగర్ సర్కిల్ జిహెచ్ఎంసి ప్రజావాణిలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బోయిని మహేష్ యాదవ్ సోమవారం అసిస్టెంట్ కమిషనర్ మణికర్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో బీహార్, యూపీ, జార?ండ్ ప్రజలు అత్యాధికంగా ఎంతో నిష్టగా భక్తిశ్రద్ధలతో ఈ నెల 27,28 తేదీల్లో జరగబోయే ఛాత్ పూజ ఏర్పాట్లకు సంబంధించిన సమస్యల పరిష్కరించాలని కోరారు. అలాగే మాదినగూడ ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన సమస్యలతో పాటు హుడా కాలనీ నుండి సాయిబాబా దేవాలయం, లింగంపల్లి రైల్వే బ్రిడ్జ్ వరకు రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా తైయారైందని ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ రోడ్డు పనులకు మరమ్మత్తు నిర్వహించాలని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించే విదంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ కమిషనర్ మణికర్ సానుకూలంగా స్పందించి వెంటనే పై అధికారులకు ఈ సమస్యలను వివరించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పవన్, పాలం శ్రీనివాస్, శివ, సాయి రెడ్డి, కె.వి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మధినగూడ సర్వీస్ రోడ్డును సందర్శించిన పోలీసు అధికారులు



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం) :**
అనునిత్యం ట్రాఫిక్ రద్దీతో కనిపించే నగరంలో పాదాచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ పాత్ లు వ్యాపార కేంద్రాలుగా దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ నగరమంటేనే వ్యాపారాలకు మంచి అడ్డా. బడా వ్యాపారస్తుల నుంచి బడ్డీ కొట్టుల వరకు ఇక్కడ ఇది లేదని చెప్పలేం. ఇప్పుడు అలాంటి ఫుట్ పాత్ వ్యాపారాలే పోలీసులకు తలనొప్పిగా మారాయి. వ్యాపారాల వల్ల ఫుట్ పాత్ ఉపయోగించి నడక సాగించే పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని సోమవారం మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, సీపీ సైబరాబాద్ డాక్టర్ గజారావు బూపాల్, డీసీపీ మెడ్చెల్ ట్రాఫిక్ రంజన్ రతన్ కుమార్, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ వేరన్న, ఏసీపీ ట్రాఫిక్ కూకట్‌పల్లి వెంకటయ్యలు మధినగూడ సర్వీస్ రోడ్డును సందర్శించారు. ఈ సందర్బంగా మియాపూర్ ట్రాఫిక్ పోలీసు పరిధిలో నిర్మాణ పనులు జరుగుతున్న ఆక్రమణలను సమీక్షించారు. అనంతరం మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి అధికారులతో సమన్వయం చేసుకుని ఫుట్ పాత్, సర్వీస్ రోడ్డు ఆక్రమణలను తొలగించాలని పోలీసు ఉన్నతాధికారులు సూచించినట్లు తెలిపారు. ఆల్విన్ నుండి లింగంపల్లి వైపు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి, రద్దీని తగ్గించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే భూపతి రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



**నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 13 (నినాదం) :** నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ లో గల అశోక టౌన్ షిప్ లోని ఎమ్మెల్యే నివాసం లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి ని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీ నర్సమ్మ గత నెల 29న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి భూపతి రెడ్డిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భూపతి రెడ్డి మాతృమూర్తికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఆయన వెంట సీనియర్ నాయకులు ఉన్నారు.

# కుత్బుల్లాపూర్ పైప్‌లైన్ రోడ్డుపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం ఎప్పుడు..?

### -పులి బలరాం, ఆకుల సతీష్




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 13 (నినాదం):**
కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సుచిత్ర నుండి షాపూర్ నగర్ వరకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఫాక్ సాగర్ నాలాపై కేవలం 10 అడుగుల రోడ్ మాత్రమే ఉండటం వల్ల ప్రతిరోజూ వందలాది వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొం టున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినా, ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదు. 2022లో ఎస్ఆర్డీపీ ప్రాజెక్టు ద్వారా రూ.56 కోట్ల నిధులు మంజూర య్యాయని సంబంధిత జీవోలో స్పష్టంగా పేర్కొన బడింది. మూడు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో పులి బలరాం, ఆకుల సతీష్ నాయకత్వంలో స్థానిక ప్రజలు కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ నర సింహకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ"కుత్బుల్లాపూర్ ప్రజలు దశాబ్దా లుగా ట్రాఫిక్ కష్టాలతో సతమతమవుతున్నారు. మూడు సార్లు హ్యాట్రిక్‌గా గెలిచిన టీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద 2022లో ఎస్ఆర్డీపీ కింద రూ.56 కోట్ల నిధులు మంజూరయినట్లు చెప్పుకొని ప్రజలతో ప్రచారం చేసినా, ఈరోజు వరకు ఒక్క పనీ ప్రారంభం కాలేదు. ప్రజలను మోసం చేసిన ఈ ఎమ్మెల్యేకి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని" అన్నారు.తన సొంత గ్రామంలోని రోడ్డు విస్తరణ పనుల వల్ల భూములు కోల్పోయిన ప్రజలకు ఇప్పటివరకు నష్టపరిహారం కూడా చెల్లిం చలేని ఎమ్మెల్యే ఇప్పుడు బ్రిడ్జ్ పనులు చేయకుండానే సన్మానాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. వెంటనే ఎస్ఆర్డీపీ, జీహెచ్ఎంసీ అధికారులు స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు ప్రారంభించకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు.జీడిమేట్ల డివిజన్‌లో పార్క్ అభివృద్ధి పనులు తక్షణమే ప్రారంభించాలని కోరారు. జీడిమెట్ల డివిజన్ రుక్మిణి ఎస్టేట్ కాలనీలో పార్క్ స్థలాన్ని ఎమ్మెల్యే బంధువులు ఆక్రమించినట్లు స్థానికులు ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు తక్షణమే స్పందించి ఆ స్థలాన్ని రక్షించి, కాంపౌండ్ వాల్ నిర్మించి బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు పార్క్ శుభ్రత, పచ్చదనం, బెంచీలు, పిల్లల ఆట స్థల అభివృద్ధి వంటి పనులు చేపట్టకపోవడంపై పులి బలరాం, ఆకుల సతీష్ డిప్యూటీ కమిషనర్‌ను నిలదీశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ వారం రోజుల్లో పార్క్‌ను పూర్తిగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారని ప్రకటనలో పేర్కొన్నారు.కుత్బుల్లాపూర్ పైప్‌లైన్ రోడ్డుపై ఫాక్ సాగర్ మీద స్టీల్ బ్రిడ్జ్ పనులు తక్షణమే ప్రారంభించాలి.రుక్మిణి ఎస్టేట్ పార్క్ అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.ప్రాజెక్టు నిధులు వృథా కాకుండా సంబంధిత అధికారులపై పర్యవేక్షణ బలోపేతం చేయాలని ఫిర్యాదులో వివరించారు.ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్, అరుణ్ రావు, జగదీష్ గుప్తా, దయాకర్, రామకృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం



**అల్వాల్, అక్టోబర్ 13 (నినాదం):**
బిఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం రహమత్ నగర్ లోని ఎస్ పి ఆర్ హిల్స్ గ్రౌండ్‌లో అట్టహాసంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు గారు (కేటీఆర్) హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీ తన్నీరు హరీష్ రావు, చామకూర మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. వేలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తల సమీకరణ ఈ సమావేశాన్ని విజయవంతం చేసింది.కేటీఆర్ మాట్లాడుతూ, వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీత గోపినాథ్ గారికి గెలుపునిచ్చేందుకు ప్రతి కార్యకర్త కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకే ఓటు వేసి పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు.అభ్యర్థి మాగంటి సునీత అభ్యర్థిత్వానికి మద్దతుగా కార్యకర్తల సమన్వయం పనిచేయాలని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై కార్యకర్తలకు అవగాహన కల్పన.జూబ్లీహిల్స్‌లో పార్టీ విజయమే లక్ష్యంగా సమిష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమం కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి , సబిత అనిల్ కిషోర్ గౌడ్, మేకల సునీత రాము యాదవ్, బద్దం పరుశురాం రెడ్డి, జేపీసీ వెంకన్న,ఏకే మురుగేష్, అమీనుద్దీన్, చిన్న యాదవ్,డోలి రమేష్, ఢిల్లీ పరమేష్ లక్ష్మణ్ యాదవ్ శోభన్ బాబు, శివ గౌడ్, సాయి గౌడ్, సురేష్ సంపత్ యాదవ్ హేమంత్ పటేల్, వంశీ ముదిరాజ్, జనార్ధన్ మారుతి ప్రసాద్, రాజశేఖర్ రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



**పటాన్ చెరు. అక్టోబర్ 13( నినాదం):** అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. సోమవారం అమీన్పూర్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా మంచినీరు, నిరంతర విద్యుత్, పాఠశాల, అంగన్వాడి తదితర సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైన తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, మల్లేష్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎన్నికల పారదర్శకతను స్థాపించటం కాంగ్రెస్ లక్ష్యం




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 13 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం 125 డివిజన్ దేవేందర్ నగర్ మైనారిటీ నాయకులూ అఫ్జల్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయన్నీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మిదాగా ప్రారంభించారు.అనంతరం నిర్వహించిన సంతకాల సేకరణలో కార్యక్రమంలో కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఎన్నికల పారదర్శకతను స్థాపించటం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "ప్రతి ఓటు పవిత్రం ు ప్రతి ఓటరుని ఓటు హక్కు రక్షించటం మన బాధ్యత" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవు కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొంగుల అంజలి యాదవ్, డివిజన్ అధ్యక్షులు ఎండి లాయక్, అలేటి శ్రీనివాస్ రావు, శ్రీనివాస్ రావు ,అజయ్, షఫీ, గఫ్ఫార్, రెహానా బేగమ్, కౌసల్య, అజామ్, జమీర్, మహేష్, కాజా, రవి చారి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాయి కృష్ణ ఫేస్ 2 కాలనీకి నిధులు కేటాయించండి

### ఎంపీకి కాలనీవాసులు విన్నపం



అల్వాల్, అక్టోబర్ 13 (నినాదం) నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్ సాయికృష్ణ ఫేజ్ 2 కాలనీ సంక్షేమ సభ్యులు బిజెపి సీనియర్ నాయకుడు ఉపేందర్ రెడ్డి, ఉత్తమరెడ్డి తోమల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్. శామీర్పేట్ నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు.కాలనీలో పలు పెండింగ్ పనులు వారి దృష్టికి తీసుకురాగా వెంటనే ఎంపీ ఈటెల రాజేందర్ స్పందించి ఎంపి నిధుల నుంచి డ్రైనేజీ పనులకు విడుదల చేస్తానని హామీ ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు. డివిజన్‌లో ఎలాంటి సమస్య ఉన్నా తనకు తెల్పాలని ఎంపీ తెలిపారని అన్నారు. ఎంపీ నిధులను%శీ%డి మాగ్జిమమ్ ఎన్ని విలు ఐతే అన్నీ కేటాయిస్తాను, ప్రతిపాదనలు ఇవ్వండీ అని ఎంపీ అన్నట్లు కాలనీ వాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వరప్రసాద్,సురేష్ కుమార్, ప్రవీణ్ కుమార్, జి బి సింగ్, గోపీ కృష్ణ, శ్రీనాథ్, అభిషేక్,శివ కుమార్ శ్యామ్ , దినేష్, అకారం సాయి మరియు ఇతరులు పాల్గొన్నారు.

## బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం

**సిద్దిపేట దుబ్బాక( నినాదం):**
జిల్లాలో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చెయ్యాలని సోమవారం తొగుట లో బంద్ నిర్వహించారు.ప్రజలు, వ్యాపార వర్గాలు, విద్యార్థులు, సామాజిక సంస్థలు బంద్‌కు సంఘీభావం తెలియజేశారు.ఈ సందర్భంగా బీసీ నేత బొడ్డు నర్సింలు యాదవ్ మాట్లాడుతూ.బీసీ వర్గాల గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ కమిషన్ సిఫారసులు వెంటనే అమల్లోకి తీసుకొచ్చి రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాత్కుల వెంకటేశం,సుత్తారి రమేష్, సిరినేని గోవర్ధన్,నందారం నరేందర్ గౌడ్,కంకణాల నర్సింలు,దోమల కొమురయ్య, కురుమ యాదగిరి,కడారి నరేందర్,రడం భాస్కర్. ప్రసాద్,బొడ్డు తిరుపతి చిప్ప నర్సింలు,సిలివేరీ శ్రీనివాస్ గౌడ్,కల్లెపు భానుచందర్, ఆత్మకూరి రాజు ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## డీజీపీ శివధర్ రెడ్డికి బంజారా భారత్ ప్రతినిధుల వినతి



**చంపాపేట్ :** రాష్ట్రంలో గోండు, కోయ, బంజారా, లంబాడీ గిరిజన తెగల మధ్య ఇటీవలి కాలంలో పెరుగుతున్న అపోహలు, అసూయలు, విభేదాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ తెలంగాణ బంజారా భారత్ తెలంగాణ శాఖ ప్రతినిధులు రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి గారిని హైదరాబాదులోని డీజీపీ కార్యాలయంలో కలిసారు.ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి గారికి కూడా మెమొరాండం అందజేసి, గిరిజన తెగల మధ్య చోటుచేసుకుంటున్న అనవసర సంఘర్షణలపై సవివరంగా వివరణ ఇచ్చారు.ప్రతినిధి బృందంలో మాజి మంత్రి, మాజి ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీ రవీంద్ర నాయక్, బంజారా భారత్ జాతీయ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జగన్ నాయక్ విస్లావత్, రాష్ట్ర నాయకులు రాంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు."గిరిజన తెగల మధ్య అసమజస్యం, అపోహలను ప్రేరేపిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో శాంతి %-% ఐక్యత నెలకొనేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి," అని డీజీపీకి విజ్ఞప్తి చేశారు.అలాగే, జతపరిచిన మెమొరాండంలో పేర్కొన్న ఇతర గిరిజన సంక్షేమ సమస్యలపై కూడా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## రాజసింగ్ వ్యాఖ్యలు మమ్ములను భాదించాయి



**వికారాబాద్, అక్టోబర్ 13(నినాదం ):** గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ మాహమ్మద్ ప్రవక్తపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ముస్లింలు వికారాబాద్ సీ ఐ కి వినతిపత్రం అందజేశారు. మత పరమైన వ్యాఖ్యలు చేసిన రాజసింగ్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మనోభావాలు దెబ్బతినే విధంగా పవిత్రమైన ప్రవక్తపై ఇష్టారాజంగా మాట్లాడటం సముచితం కాదని ఆయన పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కాంగ్రెస్ పథకాలను ప్రజలకు తెలపాలి

### -ఏఐసీసీ సభ్యుడు, ఎంపీ రాబర్ట్ బ్రూస్



**చేవెళ్ళ అక్టోబర్ 13(నినాదం):-**పేద బడుగు బలహీన వర్గాల అభివృద్దె లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రవేశపెడుతుందని, ఈ పథకాలను ప్రజలకు వివరించాలని ఏఐసీసీ సభ్యుడు ఎంపీ రాబర్ట్ బ్రూస్ పేర్కొన్నారు. సోమవారం,రంగా రెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుల ఎన్నికల నేపథ్యంలో అభిప్రాయ సేకరణలో భాగంగా చేవెళ్ల,శంకర్ పల్లి పట్టణ కేంద్రంలో చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ ఫామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రె స్ పార్టీ నాయకుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసిసి సభ్యుడు గౌరవ ఎంపీ రాబర్ట్ బ్రూస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పీసీసీ ఉపాధ్యక్షులు వినయ్ రెడ్డి విజయ రెడ్డి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ ఒబెదుల్లాకొత్వాల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.డిసిసి అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను ప్రతి నియోజకవర్గంలో బ్లాక్ల వారీగా రెండు సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. అందులో భాగంగా సోమవారం చేవెళ్ళ ఏ బ్లాక్ సమావేశం నిర్వహించామన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మండల నాయకులు కాన్స్టెన్సీ నాయకులు యువజన నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దరఖాస్తులపై అధికారులు సత్వరమే స్పందించాలి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్**
**ప్రజావాణిలో కలెక్టర్ ఎం మనుచౌదరి**





**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి,అక్టోబర్13 (నినాదం):** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజలు సమర్పించిన ఆర్జీలపై సత్వరమే స్పందించాలి జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి పేర్కొన్నారు. ప్రజల సమస్యలతో సమర్పించిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి, వాటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె. ఎల్.బి. హరిప్రియలతో కలసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన ఆర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని , దరఖాస్తుల పై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. స్వీకరించిన ఆర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పెండింగ్ లో ఉన్న ఆర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తుల పై అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని, అదేవిధంగా తిరస్కరించే ధరఖాస్తులకుగాను అర్జీదారులకులకు తగు కారణాలు తెలపాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణిలో 81 ఆర్జీలు వచ్చాయని, అందులో ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, పౌరసరఫరాల శాఖ, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వేను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ ప్రతినిధి, అక్టోబర్ 13 (నినాదం) :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరు పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు విద్యాసంస్థల్లో వంద శాతం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులు అందరూ ప్రభుత్వ విద్యాసంస్థలను నిరంతరం తనిఖీ చేస్తూ ఉండాలని చెప్పారు. ఈ నెల 15 వ తేదీ నుంచి నవంబర్ 14 వ తేదీ వరకు పశువుల్లో ఫుట్ అండ్ మౌత్ వ్యాధి నిర్మూలనకు గాను టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ లో ఉన్న వరద నష్ట నివారణ బకాయిలు చెల్లించేలా తహశీల్దార్లు చొరవ చూపాలని పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముత్తంగిలో రూ.12 కోట్ల 30 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**పటాన్ చెరు, అక్టోబర్.13( నినాదం) :** తెల్లాపూర్ మున్సిపాలిటీ ముత్తంగి గ్రామ పరిధిలోని వివిధ కాలనీలలో 12 కోట్ల 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఉదయం పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ముత్తంగి పరిధిలోని నూతన కాలనీలలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మండల తహసిల్దార్ రంగారావు, మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీలు స్వప్న శ్రీనివాస్, ప్రభాకర్ గుప్తా, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, సందీప్, రామకృష్ణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అమీన్‌పూర్ మున్సిపల్ ఆఫీస్ అడ్డాగా మార్చుకున్న మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

**సంఘటనపై అదనపు కలెక్టర్**
**చంద్రశేఖర్ కి పిర్యాదు చేసిన గడీల శ్రీకాంత్ గౌడ్**



**పటాన్ చెరు, అక్టోబర్13(నినాదం) :** అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 1016 లో జతుగుతున్న అక్రమాలపై కూడా విచారణ జరపాలని కోరారు. ఇటీవల పటాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ పాండు రంగారెడ్డి చేసిన అక్రమాలపై ధ్వజమెత్తి బాధితుల తరపున నిలిచి పోరాడిన పటాన్ చెరు మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ ప్రజావాణి సోమవారం నాడు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కి అమీన్ పూర్ కమిషనర్ జ్యోతి రెడ్డి మరియు మాజీ మున్సిపల్ చైర్మన్ పాండు రంగారెడ్డి, పవన్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి చేసిన అక్రమాలపై పిర్యాదు చేయడం జరిగింది. పదవి కాలం ముగిసిన తరువాత కూడా మున్సిపల్ ఆఫీస్ అడ్డాగా చేసుకొని అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి అక్రమ వసూళ్లు చేస్తూన్న పాండురంగారెడ్డి మరియు ఆయనకు సహకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ జ్యోతి రెడ్డి పై చట్ట పరమైన చర్యలు తీసుకొని బాధితులకు వీరి ఆగడాల నుండి విముక్తి కలిగేలా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రాణ రక్షణ కొరకు హెల్మెంట్ తప్పనిసరి

**లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు**
**తనిఖీల్లో చేవెళ్ల పోలీసులు వెల్లడి**



**చేవెళ్ళ అక్టోబర్13(నినాదం):** ప్రాణ రక్షణ కొరకు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చేవెళ్ల పోలీసులు సూచించారు. సోమవారం చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో ఎస్సై శిరీష ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు, వెనకాల కూర్చున్న వారు కచ్చితంగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. వాహనదారులు లైసెన్స్ లేకుండా వాహనాలను నడప రాదని, లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, కారు, భారీ వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. వాహనదారులు పాదాచారులు పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**తహసీల్దార్ కె ఆర్ కె వి ప్రసాద్**



**భద్రాచలం అక్టోబర్ 13(నినాదం) :** గత రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ కె ఆర్ కె వి ప్రసాద్ బూర్గంపాడు మండల ప్రజలకు సోమవారం ఓ ప్రకటన ద్వారా సూచించారు. గోదావరి, కిన్నెరసాని వాగు లోతట్టు ప్రాంత ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం జారీ చేస్తున్న వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైతే తప్ప ఇంటి నుండి బయటకు వెళ్లాలని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, కరెంటు స్తంభాలు , ట్రాన్స్ఫార్మర్లకు దూరంగా ఉండాలని, ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే విద్యుత్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులు వారి సంబంధిత మోటర్లు తడవకుండా భద్రపరచుకోవాలని తెలిపారు.

# డీసీసీ అధ్యక్ష పదవి పోటీలో చింపుల సత్యనారాయణ రెడ్డి



**చేవెళ్ల అక్టోబర్ 13 (నినాదం):** తెలంగాణ డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం కాంగ్రెస్ నేతలు భారీగా పోటీ పడుతున్నారు. నేపథ్యంలో సోమవారం డిసిసి అధ్యక్ష ఎన్నిక, ప్రజా అభిప్రాయ సేకరణ కొరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలో చేవెళ్ల నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసిసి సభ్యుడు గౌరవ ఎంపీ శ్రీ రాబర్ట్ బ్రూస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, పీసీసీ ఉపాధ్యక్షులు వినయ్ రెడ్డ, విజయ రెడ్డి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లాకొత్వాల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోరంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షునిగా పోటీలో చింపుల సత్యనారాయణరెడ్డి పోటీ పడుతున్నాడు. ఈ మేరకు ఏ సి సి సభ్యుడు ఎంపీ రాబర్ట్ బ్రూస్ కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పిఎస్ఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యా సంస్థలలో డ్రైడే కార్యక్రమం



**సిద్దిపేట(నినాదం) :** దోమలు వృద్ధి చెందకుండా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో ఈనెల 14వ తేదీ మంగళవారం ప్రత్యేక డ్రైడే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల ప్రభావంతో దోమలు అధికంగా వృద్ధిచెంది విద్యార్థులపై ప్రభావం చూపకుండా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో పంచాయతీ మరియు మున్సిపల్, వైద్యానికి శాఖ సహకారంతో మంగళవారం డ్రై డే నిర్వహించి నిలవనీటిని పారబోయాలని, ఫాగింగ్ చేయాలని అన్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనంలో సాంబారుకు బదులు పచ్చిపులుసు పెడుతున్నారని, కచ్చితంగా మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు కోతకు వచ్చాయని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను సమకూర్చి కొనుగోలు సరిగా జరిగేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. అదేవిధంగా పంటల వారీగా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ కూడా త్వరగా పూర్తిచేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయంలో ఆర్టిఐ వారోత్సవాల నిర్వహించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ వేగం పెంచాలని, నిర్మాణాలు పూర్తయిన సబ్ సెంటర్లు, పీహెచ్సీల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్13 (నినాదం) :** జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్ ఆదేశించారు. సోమవారం ఖరీఫ్ 2025-26 సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సంసిద్ధత పై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్ని జిల్లాల అదనపు కలెక్టర్ల తో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలుచేశారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్ లోని ఎన్ ఐ సీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డిఎం జగన్, డి ఆర్ డి ఓ పీడీ ఉమాదేవి తో కలిసి వీసీ కి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఖరీఫ్ 2025-26 సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం వరి ధాన్యం గ్రేడ్-ఎ రకానికి రూ.2389, కామన్ రకానికి రూ. 2369 మద్దతు ధర కల్పిస్తోందని, సన్న రకం వరికి రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కాబట్టి సకాలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పీపీసీ లకు ధాన్యం తెచ్చిన తర్వాత ఆలస్యం కాకుండా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వరి ధాన్యం కొనుగోళ్ళ పర్యవేక్షణకు సూపెర్వైజరి కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.గన్నీ బ్యాగులు, ధాన్యం క్లీన్ చేసే యంత్రాలు, బరువు కొలిచే యంత్రాలు, తేమ కొలిచే డిజిటల్ కాలిపర్స్, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా సామాగ్రి ఏదేనా అవసరం ఉంటే ఇండెంట్ పంపాలన్నారు, ఇదివరకే పంపి ఉంటే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. అదేవిధంగా ఈ సీజన్ బ్యాంకు గ్యారంటీ లు సమర్పించిన మిల్లర్లకే ధాన్యం కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. సీఎంఆర్ ధాన్యాన్ని వేగంగా సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.అదనపు కలెక్టర్ మ్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ 2025-26 సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ నెలాఖరుకు దాదాపు అన్ని పీపీసీ లకు పూర్తి స్థాయిలో ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఆలోపు అన్ని సిద్ధం చేయాలన్నారు. పీపీసీ లలో కావాల్సిన అన్ని సామాగ్రి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గన్నీ బ్యాగులు, ధాన్యం క్లీన్ చేసే యంత్రాలు, బరువు కొలిచే యంత్రాలు, తేమ కొలిచే డిజిటల్ కాలిపర్స్ సహా అన్ని రకాల సామాగ్రి అన్ని పీపీసీ లలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పీపీసీ లలో రైతుల ధాన్యం తడవకుండా కావాల్సినన్ని టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సన్న దొడ్డు రకం ధాన్యానికి ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేయాలన్నారు. పీపీసీ ఇంచార్జి లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీఓ రాణి, డీటీఓ మానస, డిఏఓ ఆంజనేయులు గౌడ్, మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు సామాన్యులకు ఎండమావేనా!




**స.హ.చట్టానికి 20 ఏండ్లు పూర్తయినా ప్రజల్లో కానరాని చైతన్యం**
**అధికారుల్లో లోపించిన జవాబుదారి తనం**
**తూతూ మంత్రంగా సెక్షన్ 4(1)బీ అమలు.!**

**కోదాడ,(నినాదం):** ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు, పాలనలో అధిపతులు. పాలకుల పనితీరు ఎలా ఉందో. తెలుసుకునే అవకాశం ప్రతి పౌరునికి వుండాలి. అదే సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ చట్టం దేశ వ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. అక్టోబర్ 12 కి 20 వసంతాలు పూర్తయి 21 సంవత్సరం లోనికి అడుగు పెడుతుంది. అవినీతి, అన్యాయం, బాధ్యతారాహిత్యానికి చెక్ పెట్టిన ఈ చట్టం సామాన్యుడికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును ఇచ్చింది. ప్రజా ధనం ఎక్కడ ఖర్చువుతోంది? ఏ ఏ పథకాలు ఎలా అమలవుతున్నాయి? ఎవరు లబ్ధిదారులు? అన్నింటిపై సమాచారాన్ని అడిగే అధికారం ఇప్పుడు ప్రతి పౌరుడికుంది.

**అధికారుల బాధ్యత... ప్రజల హక్కు**

సమాచార హక్కు చట్టం, 2005 ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లు, ఫోన్ నంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలి. దరఖాస్తు వచ్చిన 30 రోజుల్లోపు సంబంధిత సమాచారం ఇవ్వడం అధికారుల బాధ్యత. అది చేయకపోతే జరి మానా విధించే అధికారం సమాచార కమిషన్ కు ఉంది. సమాచారం ఇవ్వకపోవడం, తప్పుడు సమాచారం ఇవ్వడం చట్టపరంగా నేరమే.

**ఎలా దరఖాస్తు చేయాలి**

సమాచారం కావాల్సిన వారు తెల్ల కాగితంపై రాసి సంబంధిత కార్యాలయంలోని సమాచార అధికారికి దరఖాస్తు చేయాలి. గ్రామ స్థాయిలో రుసుము అవసరం లేదు. మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 రుసుము చెల్లించాలి. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి పూర్తిగా ఉచితం. సమాచారం ముద్రణ రూపంలో ఇవ్వడానికే అయ్యే ఖర్చు మాత్రమే వసూలు చేస్తారు.

**దరఖాస్తు స్వీకరించకపోతే నేరం**

సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న అర్జీని స్వీకరించకపోవడం లేదా నిర్ణీత సమయంలో సమాచార ఇవ్వకపోవడం చట్టపరంగా నేరం సెక్షన్ 20(1) ప్రకారం రోజుకు 250 రూపాయల జరిమానా విధించవచ్చు. ప్రజలు తమ హక్కును వినియోగిం చుకోవాలి.

**చట్టం ఉన్నా అవగాహన తక్కువ..**

ఇప్పటికీ గ్రామీణ స్థాయిలో ఈ చట్టంపై అవగాహన తక్కువగా ఉంది. చాలా మంది దరఖాస్తు ప్రక్రియ, రుసుము వివరాలు తెలియక వెనుకడుగు వేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, సమాధానాల లేమి ప్రజల్లో నిరుత్సాహం కలిగిస్తోంది.సమాచార హక్కు చట్టం నిజమైన ప్రయోజనం పొందాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలి.

## చట్టంపై అవగాహన పెంచుకోవాలి

**సిసిఆర్ సభ్యుడు, లెక్చరర్ గద్దె రాంబాబు.**



పంచాయతీ గ్రామ మొదలుకొని పార్లమెంటు వరకు ఒక్క దరఖాస్తు తో కావాల్సిన సమాచారాన్ని పొందే హక్కు ఈ చట్టం కల్పించింది. ఒక వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించే అంశం అయితే 48 గంటల్లో సమాచారం ఇవ్వాలని చట్టం చెబుతోంది. స హ చట్టంలో సెక్షన్ 4(1) బి గుండె కాయవంటిది. దీనిలో 17 అంశాలు ప్రతి కార్యాలయంలో బోర్డు రూపంలో ఉండాలి. కానీ కొన్ని కార్యాలయాల్లో మాత్రమే 17 అంశాలతో బోర్డులు కనిపిస్తాయి. తెలంగాణ రాష్ట్రం లో కేవలం 20 శాతం మంది ప్రభుత్వ అధికారులకు మాత్రమే స హ చట్టంపై ఇప్పటివరకు శిక్షణ ఇచ్చారు. అందరూ సమాచార హక్కు చట్టం -2005 పై అవగాహన పెంపొందించుకొని అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలి.